క్లుప్తంగా

విలువలతో కూడిన విద్య అవసరం

వైరా: విద్యార్థులకు ఒక లక్ష్యంతో ముందుకు సాగుతూ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని.. ఇందుకు ఉపాధ్యాయులు సైతం కృషి చేయాలని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అమ్మ నాన్నకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటుగా ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు లేనిదే ఏ ఒక్కడూ ఈ ప్రపంచంలో రాణించడం లేదన్నారు. హెచ్ఎం జి.మాధవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దొడ్డా వరప్రసాదరావు, సురేష్, చంద్రశేఖర్, భాస్కరరావు, మాధవరావు, రామకృష్ణ, రఫి, నరసింహారావు, సీతారామారావు, పద్మావతి, తులసి, నీలవేణి, అనిత దేవి, రోజామేరీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



ప్రశ్నాపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మధిరరూరల్: మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆదేశాలతో పాఠశాల స్థాయి స్పెల్ విజార్డ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 9వ తరగతికి చెందిన ఎస్.రమ్య, వై.శ్రీ వర్షిత, వి.శరణ్య, డి.అఖిల్ ఉత్తమ ప్రతిభ చాటారు. వారికి ఆంగ్ల ఉపాధ్యాయులు తోట నరసింహారావు, జ్యోతిర్మయి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బూసా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ ప్రపంచంలో సత్తా చాటాలంటే ఆంగ్లంలో ఉత్తమ నైపుణ్యాన్ని కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో కంచిపోగు ఆదాము, కోనా బాబురావు, కిషోర్, రామిరెడ్డి, కృష్ణయ్య, చైతన్య, రాణి, సీహెచ్ చిట్టిబాబు, ఎన్ సూర్యప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



ప్రతిభ చాటిన విద్యార్థులు

మధిర: గ్రామీణ విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నట్లు శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఆకెళ్ల భారతి తెలిపారు. మధిర శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు మంగళవారం ప్రకటించిన క్యాట్ (నాలెడ్జి అసెస్మెంట్ టెస్ట్) చివరి దశ పోటీల్లో అద్భుత ప్రతిభ ప్రదర్శించినట్లు చెప్పారు. జాతీయస్థాయి పరీక్ష క్యాట్‌లో మధిర శ్రీ చైతన్య విద్యార్థులు ఐదుగురు నగదు బహుమతి, 15 మంది గోల్డ్ మెడల్, 29 మంది ప్రోత్సాహక బహుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. గణిత విభాగంలో శశి వరుణ్, శ్రీశిక్ సాకేత్, ఫిజిక్స్ విభాగంలో దేవిశెట్టి సాయి మణికంఠ, కెమిస్ట్రీ విభాగంలో షేక్ అనిస్సా తబుసం నగదు బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ నరేష్, సి.బ్యాచ్ ఒలంపియాడ్ ఇన్‌చార్జ్ కోట తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ హెచ్ఎంకు సన్మానం



వెంకటాపురంలో బదిలీ హెచ్ఎంను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు స్కూల్ కాంప్లెక్స్ బదిలీ హెచ్ఎం, మాజీ చైర్మన్ జి.సంధ్యారాణి దంపతులను ఘనంగా సత్కరించారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని వెంకటాపురం పాఠశాలలో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు, బనిగండ్లపాడు కాంప్లెక్స్ హెచ్ఎం రంగారెడ్డితో పాటు పలు పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు శాలువాలతో బదిలీ హెచ్ఎం దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యకరమంలో జిల్లా మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, స్కూల్ కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ మద్ది నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాటి బాలకృష్ణ, వెల్లంకి నాగరాజు, జంగా గురునాధరెడ్డి, మారపాక బాబురావు, చిన్నప్ప గిరిబాబు, బండారుపల్లి రాజారావు, లక్ష్మారెడ్డి, రవికుమార్, వీరయ్య, సత్యనారాయణ సూరి, సీతారామయ్య, అంజిలీదేవి, లక్ష్మి, కనకదుర్గ, బాలమురళీకృష్ణ తదితరులున్నారు.

కూలీ రేట్లకు రెక్కలు



గంధసిరి సమీపంలో పత్తి తీస్తున్న కూలీలు (ఫైల్)

- అమాంతం పెరిగిన ధరలు
- ఒక్కొక్కరికీ రూ.400 నుంచి రూ.500 డిమాండ్
- అయినా తప్పని కొరత
- ఇబ్బందులు పడుతున్న రైతులు

ఆరుగాలం కష్టపడే రైతన్నలకు ఏటా కష్టాలు తప్పటం లేదు.. అతివృష్టి.. అనావృష్టితో పాటు కూలీల కొరత అన్నదాతలను వేధిస్తున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లను పెంచుతుండటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంటోంది. కాలం కలిసొచ్చినా ఓ వైపు కూలీలు దొరక్క.. మరో వైపు రేట్లు అమాంతంగా పెంచటంతో పంట సాగు చేసేందుకు నానా పాట్లు పడుతున్నారు.

ముదిగొండ: మధిర నియోజకవర్గంలో చెరువులు, మున్నేరులు, సాగర్‌నీరు, తదితర కాలువలు, బోర్లు, బావుల కింద వరి సాగుతో పాటు పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఇతర పంటలను సాగు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఉన్న కొద్దిపాటి భూములను ఎవరికివారు సాగు చేస్తుండటంతో పాటు సొంత ఊర్లో కూలీకి వెళ్లేందుకు ఆసక్తి కనపరచకపోవడంతో కూలీల కొరత అధికమైంది. ఒక్క ఎకరం వ్యవసాయ భూమిలో దుక్కులు దున్నటం, నాట్లు వేయటం మందు చల్లటం వంటి పనులు చేయాలంటే సుమారుగా 12 మంది కూలీలు అవసరం ఉంటుంది. ఇక పత్తి, మిర్చి పంటలలో పనుల కోసం కనీసం 20మంది కూలీలు అవసరముంటుంది. కానీ ఎవరి పొలాలను వాళ్లు సాగు చేస్తుండటంతో కూలీల కొరత ఏర్పడుతుంది. దీంతో పరిసర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

మండలంలో చేపట్టిన సాగు వివరాలు..

మండలంలో వరి 2,680, పత్తి 12,600, మిరప పంట 2,800, మొక్కజొన్న 4,968, పెసర 379, మినుములు 30, బొబ్బెర 70ఎకరాల్లో రైతులు సాగు చేపట్టారు.

అమాంతం పెరిగిన రేట్లు..

మారుతున్న కాలంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు ఆకాశానంటుతున్నాయి. ఖరీఫ్‌లో కూలీల కొరత ఉండటం వల్ల కూలీ రేట్లను అమాంతంగా పెంచేశారు. ఉన్న ఊరిలో కూలీ చేస్తే తక్కువ డబ్బులు ఇస్తున్నారని సమీప గ్రామాలకు అధిక రేట్లకు కూలీకి వెళ్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో స్థానికులు పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవటంతో కూలీ రేట్లకు రెక్కలొచ్చాయి. దీంతో రైతులు ఖరీఫ్ సాగుకై పరిసర గ్రామాల నుంచి కూలీలను అడిగినంత కూలీ చెల్లిస్తూ ప్రత్యేక వాహనాల్లో తీసుకురావాల్సి వస్తుంది.

వేధిస్తున్న కూలీల కొరత..

గతేడాదితో పోలిస్తే ఈ సారి కూలీ రేట్లు ఒక్కసారిగా పెరిగాయి. గతేడాది మహిళలకు కూలీ రేటు రూ.150 నుంచి రూ.250 వరకు ఉండేది కానీ ఈ ఏడాది రూ.400 నుంచి రూ.500 వరకు పెరిగింది.అలాగే గత ఏడాది పురుషులకు కూలీ రేట్లు రూ.500 నుంచి రూ.600 వరకు కూలీ రేట్లను చెల్లించాల్సి వస్తుంది. అయినప్పటికీ కూలీల కొరత వెంటాడుతోంది.

ధరలు పెరిగాయి..



ఖరీఫ్ సీజన్‌లో గతేడాది కంటే ఈ ఏడాది కూలీల ధరలు పెరిగాయి. ఎకరానికి నాటు కూలీల రేట్లు రూ.2,600, దుగాలకు రూ.1,000, నారు కట్టలు వేసిన వారికి రూ.500, ఇలా అందరూ రేట్లు పెంచారు. దీంతో కూలీ రేట్లు అమాంతం పెరిగినప్పటికీ కొరత మాత్రం తీరటం లేదు. మొన్నటి వరకు పత్తి తీసేందుకు కిలోల్లో తీశారు. ఒక్కో కిలోకి రూ.20 నుంచి, రూ.30 వరకు ఇచ్చాం. మిర్చి ఏరేందుకు, రూ.300 నుంచి రూ.400 వరకు అడుగుతున్నారు.

– ఏలూరి కొండల్‌రావు, రైతు, పమ్మి

కూలీలు దొరకటం లేదు..



ఖరీఫ్ సీజన్‌లో ప్రస్తుతం గ్రామంలో కూలీల సమస్య తీవ్రంగా ఉంది. ఇతర గ్రామాలకు చెందిన రైతులు ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకెళ్లటంతో స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరలు పెంచినప్పటికీ కూలీలు దొరకటం లేదు. పత్తి చివరి తీత పనులు, మిరపకాయలు తీసే పనులు కలుపు తీయటం, మిరప తోటలు నీరు కట్టే పనులు లాంటి తదితర పనులకు కూలీలు చాలా అవసరం ఉంది.

– కందిముళ్ల రామారావు, రైతు, బాణాపురం

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



సత్తుపల్లిటౌన్: జేవీఆర్ పాఠశాలలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్/తల్లాడ: మండలంలోని పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 6లోగా ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వి.రవికుమార్, ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్, రాజనీతి, పాలనశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో పట్టభద్రుల నోటరు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. అదే విధంగా తల్లాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2020 నవంబర్ 1 నాటికి డిగ్రీ పాసైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని, గతంలో ఓటు హక్కు ఉన్నప్పటికీ ఈ సారి కొత్తగా ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. స్థానికంగా ఓటు హక్కు ఉన్న ప్రతి ఇక్కరూ డిగ్రీ సర్టిఫికెట్, ఫొటో జతచేసి ఆన్‌లైన్ లేదా తహసీల్‌లో అందించాలన్నారు. తల్లాడ మండల వ్యాప్తంగా 2,700 మంది పట్టభద్రులున్నారని, మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ రాజ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

విద్యార్థులకు దుప్పట్లు..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, సీపీఎస్ తనికెళ్ల, ఎంపీపీఎస్ హరిజనవాడ తనికెళ్ల, అమ్మపాలెం, రాజ్యాతండా, చిన్నగోపతి ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు మంగళవారం గ్రేస్ సర్వీస్ సొసైటీ తనికెళ్ల వారు దుప్పట్లు, గిఫ్ట్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు నాగేంద్రమ్మ, జిల్లా మహేష్, ఎంపీటీసీ ప్రసాద్, హెచ్ఎంలు, గ్రేస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ..

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు గ్రామ పంచాయతీలో స్థానిక పాఠశాలల విద్యార్థులకు మంగళవారం శ్రీభగవాన్ సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు దుస్తులు, పుస్తకాలను వితరణ చేశారు. వీటిని మంగళవారం సర్పంచ్ మారాబత్తుల మోహన్‌రావు పంపిణీ చేశారు. సేవా సమితి నిర్వాహకుల వితరణను అభినందించారు.

గైడ్లు పంపిణీ..

కల్లూరు: తోపుడుబండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 89 మంది విద్యార్థులకు మంగళవారం ఫౌండేషన్ నిర్వాహకులు సాధిక్ అలీ పంపిణీ చేశారు. అదే విధంగా పదిలో 10/10 గ్రేడ్ సాధించినట్లైతే ప్రతి విద్యార్థికి రూ.25 వేలు చొప్పున అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తమ పేదరికాన్ని గుర్తు చేసుకోకుండా వారు ఉన్నత శిఖరాలు చేరుకునేలా ప్రోత్సహించడం జరుగుతుందని సాధిక్ అలీ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పత్తిపాటి నివేదిత, స్టాఫ్ కార్యదర్శి మేడరాజు శ్రీనివాసరావు, పీఈటీ పసుపులేటి వీరరాఘవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం..

కారేపల్లి: మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన గుర్రం సుశీల కేన్సర్‌తో బాధపడుతున్నారు. కాగా.. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంధ సంస్థ, దాసు కమ్యూనిటీ సభ్యులుల ఆధ్వర్యంలో మంగళవారం బాధిత మహిళకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్, దాసు కమ్యూనిటీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుజ్జు సుధాకర్, తడకమళ్ల రాంబాబులు మాట్లాడుతూ.. దాసు కమ్యునిటీ ప్రతిభ ఉన్న పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివించేందుకు ఆర్థికంగా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది గోవర్ధనగిరి దశరథ్, గ్రామ పెద్దలు నాగేశ్వరరావు, లోకేష్, రాకేష్, గుర్రం పవన్, శేషయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో ఓటరు జాబితా అభ్యంతరాలపై ఇరు పార్టీల నాయకులు చేసిన దరఖాస్తులను స్థానిక తహసీల్‌లో ఆర్డీఓ గణేష్ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో నివాసం ఉండని కొంతమంది ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు ఆన్‌లైన్‌లో ఫారం-7 ద్వారా దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా 81 మంది దరఖాస్తుదారులు తహసీల్‌కి హాజరు కావాల్సి ఉండగా 52 మంది హాజరైయ్యారు. అనంతరం దరఖాస్తులదారుల వాంగ్మూలాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఆర్ఐ ఉషా, సత్యావతి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు అందరికీ అందాలి



బాలపేటలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

తల్లాడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికీ అందాలని వైద్యాధికారి శ్రీకాంత్, ఏపీజీవీబీ మేనేజర్ శివ సతీష్ అన్నారు. మంగళవారం మండలంలోని బాలపేట, గోపాలపేట గ్రామాల్లో భారత్ వికసిత సంకల్ప యాత్ర చేపట్టిన అనంతరం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అందని లబ్ధిదారులకు వాటిని అందించేందుకు ఈ అవగాహన సదస్సులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కోసూరి నరసింహారావు, ఎన్.మోహన్‌రావు, ఏఈఓ హసీనా, బీజేపీ మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు, ఎల్లంకి సుదాకర్, కార్యదర్శులు పవన్‌కుమార్, మహేష్, ఎఎస్ఎంలు జ్యోతి, రాంబాయి, త్రివేణి, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, శరత్, అప్పారావు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో స్థానం



రేగళ్ల ప్రతీష్‌రెడ్డి

మధిర: రాష్ట్ర రవాణా శాఖ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఇటీవల హైదరాబాద్‌లో ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మధిర మండలం మర్లపాడుకు చెందిన రేగళ్ల ప్రతీష్‌రెడ్డికి అవకాశం దక్కింది. ఈమేరకు గ్రామస్తులు పలువురు ఆయనను అభినందించారు.

మెరుగైన వైద్యం అందించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వైరా: వైరాలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం రాత్రి పాము కాటుకు గురైన బాలికకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కళాశాల, పాఠశాల ఆవరణ అంతా పిచ్చి మొక్కలతో, చెత్తా చెదారంతో మౌళిక వసతుల లోపంతో ఉందన్నారు. మౌళిక వసతుల కల్పనలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. క్రిమి కీటకాలు, విష సర్పాలు బాలికలకు ప్రాణాంతకంగా మారుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

పెనుబల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని నిర్వహించే టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వై.శ్రీనివాసరావు కోరారు. మంగళవారం లింగగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల, లింగగూడెం, కేజీబీవీ పాఠశాలల్లో మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సభలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కోదండరాం, నర్సింహారెడ్డి హాజరవుతారని.. కావున ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డి.శ్రీను, అధ్యక్షుడు మహేష్, ఎం.నాగేశ్వరరావు, కె.చిన్నరాములు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కారేపల్లి: యువత క్రీడల్లో రాణించాలని విశ్వనాథపల్లి సర్పంచ్ హలావత్ ఇందిరాజ్యోతి అన్నారు. మంగళవారం విశ్వనాథపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ యువకులకు ప్రభుత్వం పంపిణీ చేసిన టీషర్టులు, క్రీడా సామగ్రిని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సీమశ్రీ, వార్డు సభ్యుడు రవి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



వైరా: అటవీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: అధికారులు ప్రజా ప్రతినిధులతో సమన్వయంగా పనిచేసి ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మంగళవారం వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో నియోజకవర్గంలోని మండలాల అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ఏ ఒక్కరూ ఇబ్బంది పడొద్దని.. అందుకు అధికారులే ప్రధాన భూమిక పోషించాలన్నారు. అటవీ అధికారులు పోడు భూములు సాగు చేసుకునే రైతులను ఇబ్బంది పెట్టొద్దని, మండలంలోని రేలకాయలపల్లి, రంగురాళ్ల బోడు గ్రామాల్లో అవసరమైన చోట కరెంట్‌పోల్స్ వేయాలని, వైరా రిజర్వాయర్ ఆక్రమణకు గురికాకుండా.. ఆయకట్టు పరిధిలో పొలాలకు సాగు నీరు విడుదల చేయాలన్నారు. విద్యాశాఖాధికారులు 'పది' విద్యర్థులు వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని, ఏన్కూరు మండలం కొత్త మేడేపల్లి గ్రామంలో ఆదివాసీల సౌకర్యార్థం సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో గ్రామాలను కలిపే లింకు రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయడతో పాటుగా వేసవికి తాగు నీటి ఇబ్బందులు లేకుండా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. అధికారులు ప్రతి 3 నెలలకోసారి రివ్యూ సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, బొర్రా రాజశేఖర్, వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్, తహసీల్దార్లు కేవీ శ్రీనివాస్, తఫజుల్ హుస్సేన్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, శీలం నర్సిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ..

స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం వైరాలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు పలు ఉపాధ్యాయ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లారు. పదోన్నతులు, ఉపాధ్యాయ బదిలీలు తక్షణమే చేపట్టేలా కృషి చేయాలని కోరగా.. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్‌కే మన్సూర్, పెనుగొండ ఉపేందర్‌రావు, చవల ప్రకాశం, అచ్యుత్, దానియేలు, జవ్వాజి నాగరాజ పాల్గొన్నారు.

ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది..

ఏన్కూరు: రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. జాతీయ పెన్షనర్ దినోత్సవం సందర్భంగా ఏన్కూరు మండల కేంద్రంలో నిర్వహించిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రాణానికి ప్రాధాన్యత ఇవ్వండి



మాట్లాడుతున్న ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య

సత్తుపల్లిటౌన్: ప్రాణాలను పణంగా పెట్టి డ్రైవింగ్ చేయొద్దని.. ప్రయాణీకుల భద్రతకే ప్రాధాన్యత ఇవ్వాలని సత్తుపల్లి ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. రవాణాశాఖ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో అవగాహన సదస్సు నిర్వహించారు. వేగం, సమయం కంటే ప్రాణానికే ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపైనే ఉంటుందన్నారు. సమావేశంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ సాహితి, సూపర్‌వైజర్లు దామోదర్‌రెడ్డి, వెంకటయ్య, తిరుపయ్య, ఆనంద్, హెడ్‌కానిస్టేబుల్ రాజు పాల్గొన్నారు.

మిర్చి కొనుగోళ్లు చేయాలి

ముదిగొండ: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న చెంగ్‌వాంగ్ బయో టెక్ మిర్చి ఆయిల్‌మిల్‌లో రైతుల నుంచి మిర్చి కొనుగోళ్లు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కంపెనీ జనరల్ మేనేజర్ రమేష్‌కు వినతి అందించారు. ఖమ్మం నుంచే కాకుండా ముదిగొండ పరిసర ప్రాంత రైతుల వద్ద నుంచి మిర్చి కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, నాయకులు రాయల వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి కోలేటి ఉపేందర్‌రావు, అధ్యక్షులు బాస్కర్‌రావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వీరశేఖర్‌రావు, రామారావు, రమేష్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



పంటల సాగు నమూనాల చిత్ర ప్రదర్శన

ముదిగొండ: మండలంలోని మేడేపల్లిలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు పంటలపై మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామం, పంటలు సాగు అయ్యేందుకు ఉన్న సౌకర్యాలు రైతులు ఏఏ పంటలు సాగు చేస్తున్నారో వివరాలను బొమ్మల నమూనాలను గీసి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్, సర్పంచ్ రమేష్, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టుకు పోటాపోటీ..

కల్లూరురూరల్: రాష్ట్రంలోనే అతిపెద్దదైన కల్లూరు మేజర్ పంచాయతీ స్పెషలాఫీసర్ పోస్టుకు భారి డిమాండ్ పెరిగింది. గ్రామ పంచయతీల సర్పంచ్‌ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుండటంతో ఫిబ్రవరిలో పంచాయతీలకు స్పెషలాఫీసర్లను ప్రభుత్వం నియమించనుంది. దీంతో స్పెషలాఫీసర్ పోస్టుకోసం భారి ఎత్తున పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తుంది. సుమారు 19వేల ఓటర్లతో పాటు మొత్తం 23 వేల జనాభా కలిగిన కల్లూరు మేజర్ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు గత ప్రభుత్వంలో నివేదికలు సిద్ధమైనాయి. కాంగ్రెస్ కొత్త ప్రభుత్వం కల్లూరు మేజర్ పంచాయతీగా కొనసాగిస్తారా లేక మున్సిపాలిటీగా మారుస్తారా అనేది చర్చనీయాంశమైంది.

వంద అడుగుల ఎత్తులో జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణరెడ్డి

ఎర్రుపాలెం: అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలోని రాముడి భక్తుడు శీలం సత్యనారాయణరెడ్డి ఓ ఎత్తైన భవనంపై 100 అడుగుల ఎత్తులో శ్రీరాముడి, శ్రీఆంజనేయస్వామి జెండాలను ఆవిష్కరించాడు. గ్రామంలోని ప్రతి ఒక్కరికీ ఈ జెండాలు కనిపించేలా ఆవిష్కరణ చేసి రామభక్తిని చాటుకున్నాడు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న చలమాల విఠల్‌రావు

పెనుబల్లి: సీపీఎం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ పార్టీ జిల్లా నాయకుడు, మండల నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తిరుపతిరావు, నాయకులు అరుణ్‌ప్రతాప్, రాజేశ్వరరావు, నరసింహారావు, సత్యం, నాగమణి, బాబు, రాజారావు, చిరంజీవి, కొండ్రయ్య, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

స్వాతంత్ర్య సమయోధుడు నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ జయంతి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అలుపెరుగని పోరాట యోధుడు నేతాజీ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యావత్ యువతకు వారు స్ఫూర్తిదాయకమన్నారు. - సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లి: నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, తదితరులు



మధిర: నివాళి అర్పిస్తున్న స్విమ్మర్లు



కొణిజర్ల: గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో..